సాక్షి
ఏలూరు
గురువారం । 6 । మార్చి । 2025



భీమడోలు రైల్వే గేటు మూత

భీమడోలు: ఈ నెల 7, 8, 9 తేదీల్లో భీమడోలు జాతర మహోత్సవంలో భాగంగా భీమడోలు రైల్వే గేటు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ అన్నారు.





హుండీ ఆదాయం రూ.1.10 లక్షలు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమేశ్వర స్వామి దేవస్థానం హుండీలను బుధవారం లెక్కించగా రూ.1,10,922 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి తోట శ్రీనివాస్ తెలిపారు.

పన్ను వసూళ్లలో జాప్యం

మున్సిపాలిటీల్లో 50 శాతం కూడా వసూలు కాని వైనం


జంగారెడ్డిగూడెం పట్టణం

జంగారెడ్డిగూడెం: జిల్లాలోని మున్సిపాల్టీల్లో ఆస్తి పన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం నెలాఖరునాటికి 100 శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉండగా, ఏ మున్సిపాలిటీలోనూ 50 శాతం వసూళ్లు మించలేదు. జిల్లాలో ఏలూరు కార్పొరేషన్, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ, నూజివీడు మున్సిపాలిటీ, చింతలపూడి నగర పంచాయతీ ఉన్నాయి. ఈ నాలుగు మున్సిపాలిటీల్లోనూ మొత్తంగా రూ.83.64 కోట్ల ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉండగా, కేవలం రూ.47.36 కోట్లు మాత్రమే వసూలైంది. మొత్తంగా 43.38 శాతం మాత్రమే ఆస్తిపన్ను వసూలైంది.

ఆయా మున్సిపాలిటీల్లో గత ఏడాది వరకు ఉన్న బకాయిలు, ఈ ఏడాది ఆస్తి పన్ను మొత్తం కలిపి వరుసగా, ఏలూరు కార్పొరేషన్‌లో రూ.60.44 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, రూ.25.79 కోట్లు మాత్రమే వసూలైంది. **జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో పాత బకాయిలు, ఈ ఏడాది పన్ను కలిపి రూ.11.34 ట్లు వసూలు కావాల్సి ఉండగా, రూ.5.38 కోట్లు వసూలైంది. నూజివీడు మున్సిపాలిటీలో పాత బకాయిలు, ఈ ఏడాది కలిపి రూ.9.53 కోట్లు వసూలు కావాల్సి** ఉండగా, రూ.4.16 కోట్లు వసూలైంది. చింతలపూడి నగర పంచాయతీలో పాత బకాయిలు, ఈ ఏడాది కలిపి రూ.2.32 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, రూ.0.95 కోట్లు మాత్రమే వసూలైంది.

ఇదిలా ఉంటే జిల్లాలో మున్సిపాలిటీల్లో వరుసగా చూస్తే ఆస్తి పన్ను వసూళ్లలో జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ 47.43 శాతంతో ప్రథమ స్థానంలో ఉండగా, రెండో స్థానంలో నూజివీడు, మూడో స్థానంలో ఏలూరు కార్పొరేషన్, నాలుగో స్థానంలో చింతలపూడి నగర పంచాయతీ ఉన్నాయి.

మున్సిపాల్టీ	అసెస్‌మెంట్	మొత్తం ఆస్తి పన్ను (రూ.కోట్లలో)	వసూలైన పన్ను (రూ.కోట్లలో)
ఏలూరు(కార్పొరేషన్)	71,357	60.44	25.79
జంగారెడ్డిగూడెం	19,109	11.34	5.38
నూజివీడు	15,282	9.53	4.16
చింతలపూడి	7,349	2.32	0.95

పన్ను వసూళ్లు వేగవంతం చేస్తున్నాం



జంగారెడ్డిగూడెం పట్టణంలో పన్ను వసూళ్లు వేగవంతం చేస్తున్నాం. ఇప్పటికే మైక్‌ల ద్వారా, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా పన్ను చెల్లించేలా చైతన్య పరుస్తున్నాం. రూ.11.34 కోట్లకు గాను ఇంతవరకు రూ.5.38 కోట్లు వసూలైంది. మార్చి నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేసేలా చర్యలు చేపట్టాం. మొండి బకాయిలపై ప్రత్యేక చర్యలు చేపట్టి వసూలు చేసేందుకు కృషిచేస్తున్నాం. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పన్ను వసూళ్లల్లో జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీని ప్రథమ స్థానంలో నిలిచేలా అధికారులను సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటున్నాం.

– కేవీ రమణ, కమిషనర్, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ

మహిళా దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు


కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో మహిళా దినోత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ నెల 8వ తేదీన సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. సుమారు 25 స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 2కె మారథాన్, సైకిల్ ర్యాలీ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. మహిళలకు హెల్త్ చెకప్ శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, క్యాన్సర్ స్క్రీనింగ్‌కు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ పి.శారద, డీఎస్పీ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మోదేలులో వాటర్ ట్యాంక్ ఏర్పాటు



సాక్షి స్పందన

బుట్టాయగూడెం: గతనెల 25న సాక్షి దినపత్రికలో ప్రచురించిన 'దశాబ్దాలుగా చీకట్లోనే' కథనంపై అధికారులు స్పందించారు. మోదేలు గ్రామానికి మంచినీటి సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తున్నారు. గ్రామంలో 5 వేల లీటర్ల కెపాసిటీ ఉన్న వాటర్ ట్యాంక్ నిర్మించడంతోపాటు గ్రామంలోని 15 ఇళ్లకు పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసి ఇంటింటికీ ట్యాప్ నీరు వచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. జల జీవన్ మిషన్ పథకంలో సుమారు రూ.6.50 లక్షలు మంజూరయ్యాయని ఆ నిధులతో గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తకుండా సోలార్ సిస్టమ్ ద్వారా నీరు వాటర్ ట్యాంక్‌లకు వెళ్ళే ఏర్పాట్లు చేస్తున్నామని వేలేరుపాడు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గుజ్జల జగదీష్ తెలిపారు.

దూరవిద్య ఇంటర్ పరీక్షకు 454 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దూర విద్యా విధానంలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షల్లో బుధవారం తెలుగు పేపర్ బుధవారం నిర్వహించారు. పరీక్షకు 511 మందికి గాను 454 మంది విద్యార్థులు హాజరు కాగా, హిందీ పరీక్షకు 17 మందికి 15 మంది హాజరయ్యారు. ఉర్దూ పరీక్షకు నలుగురు హాజరయ్యారు.

ఉపాధి హామీలో పనులు కల్పించాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న బీకేఎంయు నాయకులు

ఏలూరు (టూటౌన్): ఉపాధి లేని గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి వలసలను నివారించాలని కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయు) నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. బీకేఎంయు రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఏలూరులో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. గ్రామీణ పేదల వలసల నివారణ కోసం ఉపాధి హామీ పనులు కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు కల్పించి, రోజు కూలీ రూ.700 ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీకేఎంయు జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు బకాయి పడ్డ డబ్బులు తక్షణమే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొలిమే బాల యేసు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు న్యాయం చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బుధవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పేపర్–2లో దొర్లిన రెండు ప్రశ్నలకు విద్యార్థులు గందరగోళానికి గురయ్యారని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రంలో రోమన్ నెంబర్ 8లో 5 మార్కుల ప్రశ్నకు సంబంధించి, రోమన్ నెంబర్ 13లో మరో 5 మార్కుల ప్రశ్న అర్థంకాకుండా ఉండడంతో విద్యార్థులు గందరగోళానికి గురయ్యారన్నారు. ఈ మేరకు విద్యార్థులు విలువైన 10 మార్కులు కోల్పోయే ప్రమాదంలో పడ్డారని ఇందుకుగాను ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చింతలపూడి: 5వ తరగతి నుండి ఎనిమిదో తరగతి వరకు ఇంటర్ మొదటి, డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశ పరీక్షకు ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నాగిరెడ్డిగూడెం ఏపీఆర్ బాలికల గురుకుల స్కూల్ ప్రిన్సిపాల్ మండలి బ్రాహ్మణేశ్వరమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 లోగా దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. 5, 6, 7, 8వ తరగతి వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్, డిగ్రీ ప్రథమ సంవత్సరాలకు మధ్యాహ్నం రెండు 2:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

కేసుల పరిష్కారానికి సహకరించాలి


లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు(టూటౌన్): కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు సహకరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఏలూరు, జంగారెడ్డిగూడెం, భీమడోలు, చింతలపూడి కోర్టుల పరిధిలోని పోలీసు అధికారులతో 8న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ యోగ్యమైన క్రిమినల్ కేసుల పరిష్కారం నిమిత్తం సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి పోలీసులు కక్షిదారులతో సంప్రదింపులు జరపాలని, రాజీకి అనుకూలమైన కేసులను ఇప్పటికే గుర్తించామని, ఆ కేసులలో కక్షిదారులకు అవగాహన కలిగించి రాజీకి ప్రయత్నించాలన్నారు. చిన్న చిన్న భేదాభిప్రాయాలు ఉన్న పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ చేస్తారని చెప్పారు. న్యాయ సలహాలు లేదా సాయం కావాల్సిన వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను 15100 లేదా 08812 224555 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నారాయణపురంలో పంచాయతీ స్థలం స్వాహా

తన భార్య పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్న టీడీపీ నేత


పంచాయతీ స్థలానికి సర్వే చేసి రాళ్లు వేయిస్తున్న సర్వేయర్లు

ఉంగుటూరు : ఆక్రమణకు కాదేది అనర్హం అన్న చందంగా తయారైంది కూటమి ప్రభుత్వంలో పరిస్థితి. కన్ను వేశారా అంతే హాంఫట్.. ఉంగుటూరు మండలం నారాయణపురంలో జాతీయరహదారిని ఆనుకుని గ్రామ పంచాయతీకి చెందిన ఆరు సెంట్ల స్థలాన్ని టీడీపీ తన పేరున ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. సర్వే నెంబరు–156/2లో ఉన్న ఈ స్థలాన్ని టీడీపీ నేత గంటా యువరాజు తన భార్య పేరున పంచాయతీ స్థలం సరిహద్దులతో 156/1 సర్వే నెంబరుతో ఇటీవల గిఫ్ట్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేయించారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తి అని, తండ్రి తనకు రాశారని రిజిస్ట్రేషన్ పత్రాల్లో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులు ఉలిక్కిపడ్డారు. పంచాయతీ కార్యదర్శి విజయ్ తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ నకళ్లు తీసుకున్నారు. చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో మంగళవారం పంచాయితీ కార్యదర్శి ఫిర్యాదు చేశారు. ఆ పంచాయితీ స్థలానికి సర్వే చేయించి హద్దులు నిర్ణయించి రాటలు పాతారు. ఫెన్సింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.పంచాయతీకి చెందిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయంపై పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టామని కార్యదర్శి తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి రద్దు చేయిస్తామని విజయ్ తెలిపారు. ఈ స్థలం మార్కెట్ విలువ రూ.కోటి ఉంటుందని అంచనా.

గూడెం రిజిస్ట్రార్ కార్యాలయంలో గోల్‌మాల్

ఈ స్థలాన్ని తప్పుడు సర్వే నెంబరుతో ఎలా రిజిస్ట్రేషన్ చేశారనేది ప్రశ్న. ఈ వ్యవహారంలో తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరి హస్తం ఉండొచ్చంటున్నారు. రిజిస్ట్రేషన్ చేసిన 90 రోజుల వ్యవధిలో సర్వే నెంబరు తప్పుగా నమోదైందనే వంకతో ప్రభుత్వ భూమిని కాజేయలనేది ఆ నాయకుడు ఎత్తుగడ. ఈ భూమిని మరో వ్యక్తికి గత నెల 12న తనఖా రిజిస్ట్రేషన్ కూడా చేశారు.

కట్టుకున్నవాడే కాలయముడై..


రేఖామాధురి (ఫైల్)

బుట్టాయగూడెం: కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు. ప్రేమించి పెళ్లిచేసుకున్న 8 నెలలకే ఓ వివాహిత జీవితం అర్ధాంతరంగా ముగిసింది. భర్త చేతిలో భార్య హత్యకాబడిన ఘటన మండలంలోని బూరుగువాడలో బుధవారం చోటుచేసుకుంది. మృతురాలి తండ్రి గొడ్డా శ్రీను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీలుగుమిల్లి మండలం చంద్రమ్మ కాలనీకి చెందిన గొడ్డా సాయి కిరణ్, బుట్టాయగూడెం మండలం బూరుగువాడకు చెందిన రేఖామాధురి(22) నాలుగేళ్ల నుంచి ప్రేమించుకుని 8 నెలల క్రితం వివాహం చేసుకున్నారు. అయితే తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో మాధురి తండ్రి గొడ్డా శ్రీను ఇద్దరినీ మందలించి సర్ది చెప్పడం జరిగేది. అయితే మంగళవారం చంద్రమ్మ కాలనీ నుంచి భార్యాభర్తలిద్దరూ బుట్టాయగూడెం మండలం బూరుగువాడకు వచ్చారు. సాయంత్రం తిరిగి వెళ్లే సమయంలో పూచికపాడులో భార్యాభర్తలు మళ్లీ గొడవ పడ్డారు. దీనితో రేఖామాధురి విషయాన్ని తండ్రి శ్రీనుకు ఫోన్‌లో చెప్పింది. వెంటనే తండ్రి ఆమెను బూరుగువాడుకు తీసుకువెళ్లారు. అర్ధరాత్రి దాటిన తర్వాత సాయికిరణ్ భార్య దగ్గరకు రావడంతో అల్లుడే కదా అని రానిచ్చారు. బుధవారం ఉదయం 6 గంటలకు రేఖామాధురి తండ్రి శ్రీను, తల్లి చిలకమ్మ, చెల్లెలు మాధురి అందరూ పొలం పనులకు వెళ్లిపోయారు. ఏడున్నర గంటల సమయంలో సాయికిరణ్ మామ శ్రీనుకు ఫోన్ చేసి మీ అమ్మాయి ఉరివేసుకుని చనిపోయిందని సమాచారం ఇచ్చాడు. దీంతో కుమార్తె మృతదేహాన్ని పరిశీలించగా గాలిపంపు తాడును పీకకు బిగించి చంపినట్లు అనుమానం రావడంతో తండ్రి శ్రీను బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలవరం డీఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు, జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు, బుట్టాయగూడెం ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రేఖామాధురి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

నూజివీడు: ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 7 వందల గ్రాముల బంగారు ఆభరణాలను, ఒక మోటార్ సైకిల్‌ను, కారును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ పీ సత్యశ్రీనివాస్ బుధవారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దొంగతనాలను నివారించాలనే లక్ష్యంతో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసి అనుమానితుల కదలికలను పరిశీలిస్తుండగా విశాఖపట్టణంకు చెందిన శీలా అనిల్‌కుమార్, పెల్లి శ్రీనివాసరెడ్డి, మచిలీపట్నంకు చెందిన వేల్పూరి అనిల్‌కుమార్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా వారు చేసిన పలు దొంగతనాల వివరాలు వెల్లడయ్యాయన్నారు. వీరు రాత్రి సమయంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లకు వెళ్లి తాళాలను పగులగొట్టి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలిస్తారన్నారు. వీటిని విక్రయించడం, తాకట్టు పెట్టడం, కరిగించి అమ్మడం చేస్తూ ఉంటారు. వీరిపై నూజివీడు, రాజమండ్రి టూ టౌన్, తెనాలి 3 టౌన్, నెల్లూరు జిల్లా దర్గమిట్ట, అనపర్తి, సర్పవరం, ఏలూరు 2 టౌన్, శ్రీకాకుళం జిల్లా సంతకవిటి, చల్లపల్లి, భీమవరం 2 టౌన్, ఏలూరు 3 టౌన్, కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లలో చోరీ కేసులున్నాయన్నారు. వీరి వద్ద నుంచి పలు కేసులకు సంబంధించిన 7 వందల గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశామన్నారు. చోరీ కేసుల్లో నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన నూజివీడు టౌన్, ఏలూరు 3 టౌన్, ఏలూరు సీసీఎస్ సీఐలు పీ సత్యశ్రీనివాస్, వీ కోటేశ్వరరావు, రాజశేఖర్, నూజివీడు టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై జీ జ్యోతీబసు, ఏఎస్సై పీ సురేష్, హెచ్‌సీ బాలరమేష్, కానిస్టేబుళ్లు సీహెచ్ రామకృష్ణ, ఎస్ రాధాకృష్ణ, ఏలూరు 3 టౌన్ హెచ్‌సీ ఓం ప్రకాష్‌లను ఎస్పీ అభినందించడంతో పాటు రివార్డులు ప్రకటించారు.

ఒప్పందాలు అమలు చేయాలి


సమగ్రశిక్ష జిల్లా కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హెచ్ఆర్ పాలసీ అమలు కోసం కమిటీని ఏర్పాటు చేయాలని, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ఇతర సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయం వద్ద సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గతంలో తమ సమస్యలపై సమ్మె చేయగా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని.. అమలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 5, 6 తేదీల్లో మండల కేంద్రంలో, కేజీబీవీ స్కూల్స్ వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో సామూహిక నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 8న జిల్లా కేంద్రంలో మహిళా ఉద్యోగుల సమస్యలపై సదస్సు నిర్వహించి, తీర్మానం చేయనున్నామన్నారు. మార్చి 11న విజయవాడలో నిరసన దీక్ష చేయాలని కమిటీ నిర్ణయించిందన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఆగ్రహం



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

ఏలూరు (టూటౌన్): మోడీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపు మేరకు రైతులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాల జిల్లా సమన్వయ సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలంటూ నినాదాలు చేశారు. రైతు సంఘం సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, రైతు కూలీ సంఘం సహాయ కార్యదర్శి షేక్ బాషా, బీకేఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. జిల్లాలో మిర్చి, పత్తి, కోకో, మినుములు, పెసలు వంటి పంటలకు ధరలు పతనమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ఇంకా ప్రారంభించలేదని, సాగునీటి ప్రాజెక్టులు, పంట కాలువలు, డ్రైన్ల నిర్వహణ ప్రైవేట్ సంస్థలకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు.

అభివృద్ధి పనుల కొనసాగింపులో జాప్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: శాసన మండలిలో బుధవారం ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌లు సద్వినియోగం చేసుకోవడంలో ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) తీవ్ర జాప్యం చేస్తోందని, ఎంఎస్ఎంఈ నిధులతో మొదలుపెట్టిన అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయని అన్నారు. తణుకు, నెల్లిమర్ల, గాజులమండ్యం పారిశ్రామిక వాడలో రూ. 36 కోట్ల అభివృద్ధి పనులు ఆగిపోయాయని వాటిని త్వరితగతిన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. తాను లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి భరత్ సమాధానం ఇస్తూ కొంత జాప్యం జరిగిందని, అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆర్డర్స్‌ను ఈ క్లస్టర్స్‌కు కేటాయించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు రవీంద్రనాథ్ తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 13,890 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రెండో పరీక్షగా బుధవారం నిర్వహించిన ఇంగ్లీష్ పేపర్ –2కు ఏలూరు జిల్లా వ్యాప్తంగా 55 కేంద్రాల్లో మొత్తం 14241 మంది విద్యార్థులకు 13890 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 12435 మంది జనరల్ విద్యార్థులకు 12207 మంది హాజరయ్యారు. 1806 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1683 మంది హాజరయ్యారు. 94 శాతం హాజరు నమోదయింది.

ఎమ్మెల్సీ దువ్వాడపై ఫిర్యాదు

కైకలూరు: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారని, చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు కైకలూరు టౌన్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల మీడియా సమావేశంలో శ్రీనివాస్ మాటలు విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, దీంతో మనోభావాలు దెబ్బతిన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సారా రహిత రాష్ట్రంగా మార్చుదాం


నూజివీడు ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్, డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ

నూజివీడు: కాపు సారాను పూర్తిగా నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, దీని ద్వారా రాష్ట్రాన్ని కాపు సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం మట్లాడుతూ కాపుసారా అనర్థాల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఎక్సైజ్ కేసుల్లో పాత నేరస్తులను బైండోవర్ చేయాలని, బైండోవర్‌ను ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించాలన్నారు. సారా తయారీ, క్రయవిక్రయాలు గురించి సమాచారాన్ని 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలిపేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రాహుల్ దేవ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.